

తిరుమలగిరిలో సాగు చేస్తున్న జొన్న పంట

# పెరుగుతున్న జొన్న సాగు

- పెట్టుబడి తక్కువ
- ఆదాయం ఎక్కువ
- ఆహారంగా పెరిగిన ప్రజల వినియోగం
- సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- నియోజక వర్గ వ్యాప్తంగా 135 ఎకరాల్లో సాగు

తిరుమలగిరి, డిసెంబర్ 3 : చిరు ధాన్యాలు అనాదిగా మన ఆహారంలో భాగమై ప్రముఖ పాత్ర పోషించాయి. అందులో జొన్న ధాన్యానికి ప్రత్యేక స్థానం ఉన్నది. అయితే ప్రస్తుత ఆధునిక కాలంలో పాల పదార్థాలు, చక్కెర, బియ్యం, గోధుమలు, జంక్‌ఫుడ్స్ తదితరాలు మన ఆహారంలో భాగం కావడంతో వాటి వల్ల మనం ఎన్నో రోగాల భారిన పడుతున్నాం. దాంతో ప్రజలు రోగాల భారిన పడకుండా, అనారోగ్యాలు పెరుగకుండా ఉండేందుకు క్రమంగా చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో జొన్నను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. జొన్న ధాన్యంలో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్స్, ఇనుము, కాల్షియం, విటమిన్ బి, ఫోలిక్ ఆమ్లం వంటి సూక్ష్మ పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. దాంతో జొన్న రొట్టె, వివిధ రకాల జొన్న ఉత్పత్తులకు ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతుండడంతో రైతులు జొన్న పంటను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. జొన్న చొప్పకు కూడా పశుగ్రాసంగా మంచి డిమాండ్ ఉన్నది. క్వింటా జొన్నలకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2,858 ప్రకటించింది. మద్దతు ధర కంటే ఎక్కువకే రూ.4 వేలకు వ్యాపారులు జొన్నలను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. నియోజక వర్గ వ్యాప్తంగా 135 ఎకరాలకు పైగా ప్రస్తుతం జొన్న పంటను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఆవాస గిరిజన పంచాయతీలు, తండాల్లో జొన్న సాగు ప్రతి ఏడాది పెరుగుతున్నది. నియోజక వర్గం వ్యాప్తంగా 50కి పైగా జొన్న రొట్టె విక్రయ కేంద్రాలు ఉన్నాయి. చాలా మంది రాత్రి వేళలో జొన్న రొట్టెలు, జొన్న అన్నం తినడం అలవాటుగా మార్చుకుంటున్నారు.

**పూర్తి ఆర్గానిక్ పంట జొన్న**

ఈ రోజుల్లో అన్ని పంటలకు పై మందుల పిచికారి, ఎరువులు వాడుతున్నారు. కానీ జొన్న సాగు పూర్తిగా ఆర్గానిక్ పంట. ఎలాంటి రసాయన ఎరువుల వాడకం ఉండదు. అందుకే రోగాల భారినుంచి ఉపశమనం పొందవచ్చేది కూడా ప్రజల ఆలోచనగా ఉంటుంది. నవంబర్‌లో జొన్న సాగు చేస్తే సంక్రాంతి పండుగ వరకు పంట చేతికి వస్తుంది.

### తక్కువ పెట్టుబడి..

జొన్న సాగుకు పెట్టుబడి తక్కువ. ఆదాయం బాగానే ఉంటుంది. విత్తనాలు, దున్నడం తప్పా మరే ఇతర పెట్టుబడి ఉండదు. ఎరువుల వాడకం ఉండదు. ఎకరానికి కిలో విత్తనాలు, దుక్కి దున్ని విత్తనాలు వేయడానికి రూ.2 వేలు అవుతుంది. ఎకరాకు దిగుబడి 8 నుంచి 10 క్వింటాళ్లు వస్తుంది. అంటే 20 వేల రూపాయలు వరకు ఆదాయం వస్తుంది.

### పశువులకు మేతగా జొన్న సొప్ప..

జొన్న సొప్ప పశువులకు మంచి మేతగాను ఉపయోగపడుతున్నది. ఎకరం జొన్న చేను సొప్ప విక్రయిస్తే రూ.5 వేలకు పైగానే ఆదాయం వస్తున్నది. అరక ఉన్న రైతుకు పెట్టుబడి ఉండదు. యంత్రాలతో దున్ని సాగుచేసిన సొప్పతో పెట్టుబడి ఖర్చులు తీరుతాయి.

**జొన్న ఆహారంతో రోగ నిరోధక శక్తి పెంపు**



జొన్నలను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మనం నిత్యం తినే ఆహార పదార్థాల్లో పీచు పదార్థాలు లేకపోవడం వల్ల వివిధ రోగల భారిన పడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఎలాంటి మందులు వాడకుండా పండించే జొన్నలను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యరీత్యా అన్ని రకాలుగా శ్రేయస్కరం.

– బిచ్చానాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, తిరుమలగిరి.

# చివరి దశలో 'డిండి' పనులు

- ఎత్తిపోతలతో దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.50లక్షల ఎకరాలకు సాగు నీరు

దేవరకొండ, డిసెంబర్ 3: పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పనులు రూ.6500 నిధులతో చివరి దశలో పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగమైన సింగరాజ్‌పల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు 3.50లక్షల ఎకరాల సాగులోకి నీరు అందుతుంది. రాష్ట్రంలో దేవరకొండ నియోజకవర్గంలోనే అత్యధిక రిజర్వాయర్లు ఉన్నాయి. అన్ని రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తయితే ప్రతి ఎకరానికి సాగు నీరు అందుతుంది. డిండి ప్రాజెక్టుతో ప్రస్తుతం 1.075 టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్‌తో 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇప్పటికే కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండిని పూర్తి స్థాయిలో నింపి డిండి ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. డిండి ఎత్తిపోతలతో చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులను నింపారు.



గొట్టిముక్కల రిజర్వాయర్ ఆనకట్టపై పూర్తయిన పనులు

### కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండికి నీళ్లు

డిండి మండలంలోని డిండి ఎత్తిపోతలను స్వాతంత్ర్యం రాక ముందే నిర్మించారు. పురాతన ప్రాజెక్టు కింద ప్రస్తుతం 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. నాలుగేండ్ల నుంచి కృష్ణ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురిశాయి. డిండిలోకి కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీటిని వదులుతున్నారు. దీంతో ఆయకట్టు సాగులోకి వచ్చింది.

### సింగరాజ్‌పల్లి రిజర్వాయర్

డిండి మండలంలోని సింగరాజ్‌పల్లి రిజర్వాయర్ 0.056 టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్ పనులు ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఆయకట్టు కింద 6500ఎకరాలకు సాగునీరు అందుతుంది. రూ.435కోట్లతో పనులు చేపట్టారు.

### 1.075 టీఎంసీ సామర్థ్యంతో గొట్టిముక్కల రిజర్వాయర్

దేవరకొండ మండలంలోని గొట్టిముక్కల సమీపంలో నిర్మితమైన గొట్టిముక్కల రిజర్వాయర్ 1.075టీఎంసీ సామర్థ్యం గల పనులు 95 శాతం పనులు పూర్తి చేశారు. రిజర్వాయర్ కింద సుమారు 10వేల ఎకరాల సాగులోకి వస్తాయి. మండలంలోని 39గ్రామాలకు సాగునీరు అందుతూ, భూగర్భజలాలు, బోరు, బావుల్లో నీరు పెరుగుతుంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.490 కోట్లుతో పనులు చేపట్టారు. రిజర్వాయర్ కట్ట పనులు పూర్తయి మెయిన్ గేట్లు పనులు పూర్తి చేశారు.



పనులు పూర్తి అయిన సింగరాజ్‌పల్లి రిజర్వాయర్ కట్ట

### రూ456 కోట్లతో పనులు

చింతపల్లి మండలంలోని పలు గ్రామాలకు చింతపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తే సుమారు 6500 ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. రిజర్వాయర్ 0.86 టిఎంసి స్వామర్థం గల రిజర్వాయర్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.456 కోట్లు నిధులచే పనులు చేపడుతున్నారు. రిజర్వాయర్ పనులు పూర్తి అవుతే చింతపల్లి సమీపంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందుతుంది.

### కిష్టరాంపల్లి రిజర్వాయర్

చింతపల్లి మండలంలోని కిష్టరాంపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తే సుమారు 2500 ఎకరాలు సాగునీరు అందనున్నది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.435 కోట్లు వ్యయంతో పనులు చేపడతున్నారు. రిజర్వాయర్ పనులు పూర్తి అయితే చింతపల్లి మండల పరిధిలోనే రెండు రిజర్వాయర్లతో సాగులోకి వస్తాయి.

# వేరుశనగ సాగుపై రైతుల ఆసక్తి



తిరుమలగిరి(సాగర్): గాత్‌తండాలో వేరుశనగ సాగు చేస్తున్న రైతులు

### 500 ఎకరాల్లో సాగు

తిరుమలగిరి(సాగర్), డిసెంబర్ 3: ఈ యేడు పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో బోర్ల బావుల కింద రైతన్నలు వేరుశనగ సాగుపై మొగ్గుచూపుతున్నారు. మండలంలోని సుమారు 20గ్రామాల్లో వేరుశనగ పంటను 500 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జానకిరాములు తెలిపారు. గతం తో పోలిస్తే ఈ సంవత్సరం తెల్ల బంగారం రేటు రూ.7 వేలకు పడిపోయింది. ఆ శించినంత దిగుబడి రాకపోవడంతో రైతన్నకు నష్టం వాటిల్లింది. కనీసం ఎకరాకు 2, 3 క్విం టాళ్ల దిగుబడి రాకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఎకరాకు కనీసం రూ.20వేల పెట్టుబడి అవుతుంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా వేరుశనగ పంటపై ఆసక్తి చూపుతున్నారు. వేరుశనగ సాగుకు ఎకరాకు రూ.20వేల పెట్టుబడి పెడితే సుమారు రూ.60వేల నుంచి రూ.80వేల వరకు లాభం వచ్చే అవకాశముంది. వేరుశనగ పంట సాగును రైతులు చేపడుతున్నారు.

### సాగర్ తీరంలో...

చందంపేట : సాగర్ తీరంలో.. రైతులు పల్లీ సాగుతో బిజీబిజీగా ఉన్నారు. ఈ సారి ఆశించిన మేర వర్షాలు లేకపోవడం.. ఎగువ నుంచి సాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేకపోవడంతో కృష్ణా వెనుక జలాలు తగ్గాయి. దీంతో రైతులు పెద్ద ఎత్తున పల్లీ సాగుకు ఉపక్రమించారు. చందంపేట మండలం లోని పెద్దమునిగల్, బుగ్గతండా, కాచరాజుపల్లి, సుద్దబాయితండా, చిన్నమునిగల్, మోసంగడ్డ తండా, మంగళితండా, గువ్వలగుట్ట, వైజాక్ కా లనీ గ్రామాల్లో విస్తరించి ఉన్న కృష్ణా వెనుక జ లాల భూభాగంలో పల్లీ సాగు జోరుగా సాగు తుంది. కృష్ణా వెనుకజలాల్లో సుమారు 265 ఎకరాల్లో 190మంది రైతులు పల్లీ సాగు చేపడుతున్నారు.ఈ ప్రాంతంలో భూమి సారవంతంగా ఉండడంతో పల్లీ సాగు ఆశాజనకంగా ఉంది.



చందంపేట: కృష్ణాజలాలతో సాగు చేస్తున్న పల్లీ

# నల్లగొండ జిల్లాలో 554 చెల్లని ఓట్లు

రామగిరి, డిసెంబర్ 3: నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 554 చెల్లని ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఈవీఎంలో వేసిన ఓట్లు ఖచ్చితంగా నమోదై ఉంటాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనే చెల్లని ఓట్లు వచ్చినట్లు స్పష్టం చేశారు. వీటిని ఎన్నికల విధుల్లో పనిచేసిన వారితోపాటు వయోవృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయించారు. అయితే విధుల్లో ఉన్న వారు దాదాపుగా అంతా చదువుకున్న వారే అయినప్పటి చెల్లని ఓట్లు నమోదు కావడంపై అంతా ఆశ్చర్యానికి గురైన సంఘటన చోటు చేసుకుంది.

### నియోజకవర్గాల వారీగా ఇలా...

నల్లగొండ నియోజకవర్గంలో– 110, నకిరేకల్‌లో – 32, మిర్యాలగూడలో 76, నాగార్జునసాగర్‌లో 122, దేవరకొండలో 157, మునుగోడులో 57 చొప్పున మొత్తం 554 చెల్లని ఓట్లు నమోదైనవి.